# అదేమి చిత్రమో!

- గుమ్మా ప్రసాదరావు



**అయిదువందలు.**
**అయిదు వందలు అర్జంటుగా కావాలి.**
**అయిదు వందలు అర్జంటుగా కావాలి ఆనందరావుకి.**
**నెలాఖరు రోజులు. జీతాలు దొరకడానికి ఇంకా అయిదారు రోజులుంది.**
**ఎవరిస్తారు?**

పరంధామయ్య, విశ్వనాథం, శంకరనారాయణ, మంజుశ్రీ, ఓంకార్, అప్పలరాజు వీళ్ళలో ఏ ఒక్కరైనా ఇవ్వరా?

కొరియర్ వాడు కొంప మునిగిపోయినట్లు ఎనిమిదో గంటకే ఆ ఉత్తరం తెచ్చి ఇచ్చాడు. అది అల్లుడు రాసినది. అల్లుడంటే దశమ గ్రహం.

'ఈరోజు రెండు గంటలకు రైల్లో నేనూ మీ అమ్మాయి వస్తున్నాం' ఒకే ఒక వాఖ్యం మరీ పిసనారి. ఒక యోగక్షేమాలు లేవు, ఎందుకు వస్తున్నారో ఎన్నాళ్లుంటారో లేదు.

"ఎవరి దగ్గరనుంచి" నళిని ప్రశ్నించింది.

"ఇంకెవరు? నీ అల్లుడు" అన్నాడు పళ్ళు పటపట కొరుకుతూ.

"మీకు కాడా? ఏమిటిరాసాడు?"

"మీ అమ్మాయిని తీసుకొని ఈ మధ్యాహ్నం రైల్లో దిగుతాడట. మీ ఏర్పాటు మీరు చేసుకొండని మనకు కర్తవ్యం బోధించడానికి ఒక్క ముక్క గొలికాడు. ఓ వారంరోజులు ముందే రాసి వుంటే నా తిప్పలు నేను పడేవాడిని. ఇప్పుడు కచ్చతో కందులు వేపుతే ఎట్లా?"

"అదేమిటండీ! అంత కోపం. అతను ఎప్పుడు రాసాడో. మనకీనాడు అందింది."

"నీకు తెలియదు నళినీ! నెలాఖరురోజుల్లోనే రావాలా? అతని మామగారు ఆగర్భశ్రీమంతుడా?"

"బాగుందండీ! ఈనెల 29న దసరా. ఇవాళ 27. ఇప్పుడుకాక పండుగ వెళ్ళిన వాసినాడు వస్తారా?

"ఈ పండుగ ఇప్పుడే చావాలా?" అన్నాడు కోపంతో కూడిన బాధతో.

"ఏమండీ బియ్యం నిండుకున్నాయి. మైదాపిండి, పంచదార, పెసరపప్పు తీసుకురండి. మిగతా సామానులు ఎలాగో సరిపెట్టుకుంటాను" అంది నళిని.

"ఆ షావుకారు మొన్నటికి మొన్న ధుమధుమలాడేడు. ముందు పాత బాకీ తీర్చండి. మాకూ డబ్బు ఇబ్బందులు వుంటాయని గుర్తుంచుకోండి అన్నాడు. నాలో ప్రాణం వుండగా బాకీ తీరేవరకు ఆ దుకాణానికి వెళ్ళను" నిష్కర్షగా చెప్పాడు నళిని హతాశురాలైంది.

"ఎవరినైనా ముష్టెత్తుతాను" పండుగంటున్నావు, బట్టా వాతాపెట్టాలిగా?"

"అక్కరలేదండీ! ఈమధ్య మా అన్న నాకూ మీకు బట్టలు పెట్టాడు. అవి అలాగే ఉన్నాయి." అంది నళిని భర్త బాధను అర్థంచేసుకొని.

"అయ్యో! ఒక్కరోజుముందు అడిగి వుంటే అయిదు వందలేం ఖర్మ వెయ్యి రూపాయలైనా ఇచ్చి వుండేవాడిని. నిన్ననే మా తమ్ముడు అవసరం అంటూ రెండు వేలు పట్టుకుపోయాడు" అన్నాడు పరంధామయ్య.

"మాదీ నీలాంటి బ్రతుకే. నెలాఖరున నా దగ్గర మాత్రం అంత డబ్బు వుంటుందని నీవెలాగ అనుకున్నావు?"అన్నాడు విశ్వనాథం.

"ఇప్పుడంటే వీలుకాదు. మూడునాలుగురోజుల తరువాత ఇవ్వగలను" అన్నాడు శంకర నారాయణ.

"నీకు తెలియంది ఏముంది? ఫైనాన్సు డిపార్టుమెంట్ మా ఆవిడ అధీనంలో ఉంది. నా సాధరు ఖర్చులకు పది రూపాయలడిగినా లక్ష యక్ష ప్రశ్నలు వేస్తుంది. మరేం అనుకోకు" అన్నాడు మంజుశ్రీ.

"ఆనందరావు! వయసులో నీకంటే నేను చిన్నవాడినే. అప్పులు చేయడమంత అపరాధం వేరొకటి లేదు. ఉన్నంతలోనే బండిని ఈడ్చుకు వెళ్ళడం నేర్చుకో" హిత బోధ చేసాడు ఓంకార్.

"రోలొచ్చి మద్దెలతో మొరబెట్టుకుందట. నేనే అప్పుకోసం తిరుగుతున్నాను. నీకిచ్చే స్థితిలో లేను" తప్పించుకున్నాడు అప్పలరాజు.

ఎనిమిదిన్నరకు ఇంటి నుంచి బయలుదేరిన ఆనందరావు ఈసురోమంటూ పన్నెండున్నరకు ఇల్లు చేరుకున్నాడు.

వేళకానివేళ వస్తున్న కూతురు, అల్లుడి మీద చెప్పలేనంత కోపంగా ఉంది. ఇందరు స్నేహితులున్నారు. అందరూ చెప్పినది ఒకటే జవాబా?

రోజులు బాగులేవు. జోళ్ళ విడిచి సోఫాలో కూర్చున్నాడు. నళిని నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

"నళినీ! మన రోజులు బాగా లేవు. ఎక్కడా ఎర్రని ఏగాణీ పుట్టలేదు."

"మీరేం దిగులు పడకండి. నేను దుకాణానికి వెళ్ళి సరుకులు తెచ్చాను. మీకు పెరుగు గార్లు ఇష్టంకదా! మినపపప్పూ తెచ్చాను."

"ఏమిటి వాడు సామానులు అప్పు ఇచ్చాడా? మరారోజు అంతలేసి మాటలన్నాడే?"

"అది వాడి వ్యాపార లక్షణమండి." తీర్చలేదన్నంతగా అప్పులు పెరిగిపోరాదని వాళ్ల తంటాలు పడతారు. ఆరోజు మీతో కర్కశంగా మాట్లాడినందుకు వాడు తెగ నొచ్చుకున్నాడు.

అమ్మగారు మీరు ఊరొదిలి వెళ్ళిపోరని నాకు మాత్రం తెలియదా అన్నాడు. సరుకులన్నీ జాస్తీగా వున్నందున నేను మొయ్యలేనని కుర్రాడి చేత పంపించాడు" అంది నళిని.

సగం గండం గడిచింది అనుకున్నాడు ఆనందరావు "కాళ్ళు కడుక్కోండి, వడ్డిస్తాను" అంటూ నళిని వంటింటిలోనికి వెళ్ళింది.

నళిని అలా వెళ్ళగానే అప్పలరాజు వచ్చాడు.

"ఆనందం! మన అదృష్టం బాగుంది. ఉదయం లేస్తూనే నేను ఎవరి ముఖం చూసానో? డబ్బు అవసరమై నిన్న వెంకటాద్రి ఇంటికి వెళ్ళాను. అప్పుడు వాడింటిలో లేడు. నేనొచ్చిన పని అతడి భార్యకు చెప్పి వచ్చాను. ఒక గంట క్రితం వెంకటాద్రి డబ్బు తెచ్చి ఇచ్చాడు. అప్పుడు నువ్వొచ్చిన సంగతి గుర్తుకొచ్చి మరో అయిదువందలు తీసుకున్నాను. ఇంద" అంటూ ఆనందరావు చేతికి అయిదువందలిచ్చాడు.

భోజనం చేసి చెయ్యి తుడుచుకుంటూ ఉంటే మంజుశ్రీ వచ్చాడు.

"ఆనందరావు ఇదిగో నీవడిగిన అయిదువందలు" అంటూ అయిదు వందల కాగితం తీసాడు.

"నువ్వలా వెళ్ళిపోగానే ఆనందరావుగారు ఉదయాన్నే ఏం పనిమీద వచ్చారు అని మా ఆవిడ అడిగింది. నేను చెప్పాను. అయ్యో! అతనికేం అవసరం వచ్చిందో, మీరు లేదని ఎందుకన్నారు? గుర్తుందా ఏడాది క్రితం మనవాడికి ఏక్సిడెంటు అయి డబ్బు లేక అవస్థలు పడుతూ వుంటే అతను తన భార్య గాజులు తాకట్టుపెట్టి అప్పుతెచ్చి మన దోసిట్లో పోసారు. తక్షణం వెళ్ళి ఇచ్చి రండి అంది ఆమె"అన్నాడు మంజుశ్రీ.

ఇది కలా నిజమా?

అబ్బురపడ్డాడు ఆనందరావు.

రెండు గంటలకు రావలసిన రైలు రెండుగంటలు ఆలస్యంగా నాలుగు గంటలకు వచ్చింది. వాళ్ళు ఇంటికి నాలుగున్నరకు వచ్చారు.

అదృష్టమే రైలు ఆలస్యంగా వచ్చింది.

రైటు టైముకే వచ్చి వుంటే అప్పలరాజు మంజుశ్రీల దగ్గర అప్పుతీసుకుంటున్న వైనం అల్లుడికి తెలిసి తన పరువుపోయేది.

"అల్లుడూ మీ అమ్మగారు నాన్నగారు బాగున్నారా? అమ్మాయి ఏమిటీ ఇంతగా చిక్కిపోయావు" అంది నళిని. ఆవిడ ప్రశ్నకు వాళ్ళ చిరునవ్వే జవాబు చెప్పింది.

"కాళ్ళు కడుక్కొని భోజనాలకు వస్తారా లేక స్నానాలు చేస్తారా?" అడిగింది నళిని.

"అమ్మా ముందు స్నానాలు" అంటూ చొరవగా లోనికి వెళ్ళింది లక్ష్మి.

వాళ్ళు స్నానాలకు వెళ్ళగానే పరంధామయ్య వచ్చాడు.

"మా తమ్ముడి పని జరిగిపోయిందట. ఏదో బ్యాంకు వాళ్ళు ఇస్తానన్న ఋణం దొరికిందట. నా డబ్బు తిరిగి ఇచ్చాడు. ఇదిగో నీవడిగిన అయిదు వందలు" అన్నాడు.

"ఆ అవసరం ఇప్పుడు లేదు పరంధామయ్య" అన్నాడు ఆనందరావు.

"నాకు తెలుసు నీకు పీకలమొయ్యా కోపం వచ్చి వుంటుంది. నా మాట విశ్వసించు. అప్పుడు నా దగ్గర



…య్యా! అతనికేం అవసరం … మీరు లేదని ఎందుకన్నారు? … ఏడాది క్రితం మనవాడికి ఏక్సి… డబ్బు లేక అవస్థలు పడుతూ … తను తన భార్య గాజులు తాకట్టు పెట్టి … తెచ్చి మన దోసిట్లో పోసారు. … వెళ్ళి ఇచ్చి రండి

చిల్లిగవ్వ లేదు. ఇప్పుడు మా తమ్ముడు తిరిగి ఇచ్చాడు ఇది నిజం. సత్య ప్రమాణంగా!"

"పరంధామయ్యా! నువ్వు చెప్తున్నది నిజమని నాకు తెలుసు. అయితే ఇంతకుముందే మంజుశ్రీ అప్పలరాజులు వచ్చి చెరో అయిదువందలు ఇచ్చి వెళ్ళారు."

"కావచ్చు. నేను నీ బాల్య స్నేహితుడిని. వాళ్ళ డబ్బు వాళ్ళ ముఖాన పారేయి. నేను ఇచ్చినది తీసుకోకపోతే మన స్నేహం మీద ఒట్టే" అన్నాడు పరంధామయ్య.

"నళినీ! ఏమిటీ విచిత్రం. లేదని ముఖంమీద నిర్మొహమాటంగా చెప్పినవాళ్ళే ఇలా ఇంటికి తెచ్చి ఇచ్చిపోయారు."

"వేళా విశేషం అండీ! మీ అమ్మాయి లక్ష్మి వచ్చిందా! లక్ష్మి ఉట్టి చేతులతో వస్తుందా?" అంది చలోక్తిగా నళిని.

"నిజం, అత్తగారు! లక్ష్మి చంచలమైనది అయినా ఉట్టి చేతుల్తో రాదు" అన్నాడు అప్పుడే స్నానంచేసి బట్టలు వేసుకు వచ్చిన అల్లుడు భాస్కరరావు.

తాము అప్పు తీసుకున్నట్లు అల్లుడికి తెలిసిపోయిందా?

"అమ్మా! నువ్వొచ్చి నాన్న పక్కన సోఫాలో కూర్చో" అంటూ తల్లి చెయ్యి పుచ్చుకొని లక్ష్మి ఆమెను సోఫాలో కూర్చోపెట్టింది.

భార్యాభర్తలు దండం పెడతారనుకుంది నళిని.

"అమ్మా! ఈమధ్య నేను ఉద్యోగంలో చేరాను. నన్ను కనీ పెంచిన వారికి నా మొదటి నెల జీతం ఇవ్వాలనుకుంటున్నాను అని ఇతనితో అన్నాను. అలాగే ఇయ్యి అన్నారు. దసరాకు ఎలాగూ వెళ్తాముగా అప్పుడు స్వయంగా ఇవ్వు అన్నారు" అంటూ ఎనిమిది వేల రూపాయలున్న కవరు తల్లికిచ్చింది. ఇద్దరూ వాళ్ళకు నమస్కారం చేసారు.

"ఇదేమిటే ఇప్పుడు దీని అవసరం మాకుందటావా? మీది కొత్త సంసారం. ఖర్చులు వుంటాయి. పండుగకు వచ్చారు అదే సంతోషం" అంది. ఆమె అశృవులు చమర్చాయి.

ఆనందరావు ఆనందానికి అవధుల్లేవు. కూతురు, అల్లుడు వస్తున్నారంటే తమ బాధలకు తోడు వీళ్ళా ఇప్పుడే రావాలా అని కలవరపడ్డాడు. ఎవరినడిగినా లాకేత్వం దాకు కొమ్మే దొరికింది. ఇప్పుడేమిటి ఇప్పుడు డబ్బు ఒక్కమారుగా వర్షించింది?!

★

# కీటకాల్ని తినే మొక్కలు!

ఆ మొక్కలు ప్రాణాలు తీస్తాయి. కీటకాల్ని పొట్టన పెట్టుకుంటాయి. కానీ వాటి ఆకులు ఎంతో అందంగా మహా ఆకర్షణీయంగా కన్పడి అందర్నీ ఆకట్టుకుంటాయి. ఆ మొక్క పేరు వీనస్ ఫ్లైట్రాప్! మరి దీనికాపేరు ఎలా వచ్చిందో తెల్సా? రోమన్ల పౌరాణిక దేవత డయోనే కూతురు వీనస్. ఆమె అందం, ప్రేమకి ప్రతిరూపం, అధి దేవత కూడా. (మనకి రతీమన్మధుల లాగా) ఆమె పేరుమీదుగా ఈ మాంసాహారి మొక్కకి ఆ పేరు వచ్చింది. నార్త్ కెరొలీనా తీర ప్రాంతంలో ఇది కన్పడ్తుంది. ఈ మొక్కలు చాలా త్వరగా చలిస్తాయి. 8 అంగుళాల వ్యాసం కలిగి ఆకుల అంచులు వాడియైన ముళ్ళు కల్గి చాలా ఆకర్షణీయంగా కనపడుతుందీ మొక్క. కజ్జికాయ ఆకారంలో ఉన్న ఆకు మధ్యలో పురుగు పట్టుబడ్తే ఆకులు ఉబ్బి దాన్ని గట్టిగా అదిమేస్తాయి. పది రోజులకల్లా తను బంధించిన పురుగుని గుటకాయ స్వాహా చేస్తుంది. మళ్ళీ ఆకులు కొంచెం ఎడంగా తెరుచుకుంటాయి. కొత్త కీటకాన్ని పట్టి భక్షించటం కోసం. ఆకులపై ట్రిగ్గర్స్ సన్నగా దారపు వెంట్రుకల పోగులా ఉండి, ఏదన్నా కీటకం వాలగానే ముడుచుకుంటాయి. ఒక్క సెకండులో ఆకు ముడుచేసుకుంటుంది. ఏదన్నా గింజ, రాయి కనక ఆకు మధ్య చిక్కుకుంటే 12 గంటల తర్వాత దాన్ని బైటికి నెట్టేస్తుంది ఈ మొక్క ఆకు!





'రెడ్‌డ్రాగన్' ఫ్లైట్రాప్ పూర్తిగా ఎరుపురంగులో ఉండి సూర్యకాంతిలో బాగా ఎదుగుతుంది. చాలామంది తమ తోటకి అందం ఇస్తుందని రాయల్ రెడ్, రెడ్ పిరాన్హా, ప్యారడైజ్, జైంట్ అండ్ సా టూత్, బిగ్ మౌళని పెంచుతున్నారు. మాంసాహార మొక్క అందం ఆకర్షణతో మనిషిని దాచేస్తోంది. అంటే ఆశ్చర్యం అన్పించటం లేదూ?

**- అచ్యుతుని**